ప్రజాశక్తి
బుధవారం 8 నవంబర్ 2023 5 అనంతపురం



సత్యసాయి జిల్లా ఏర్పాటు ఓ వరం

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



పుట్టపర్తి అర్బన్ : జిల్లాల పునర్విభజన సందర్భంగా పుట్టపర్తి కేంద్రంగా సత్య సాయి జిల్లాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలకు ఓ వరం లాంటిదని పుట్టపర్తి శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తిలో మంగళవారం నిర్వహించిన రైతుభరోసా పంపిణీ కార్యక్రమం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గతంలో కరువు కోరల్లో చిక్కుకుని అలమటించిన ఈ ప్రాంత ప్రజలకు గత ప్రభుత్వాలు ఏమీ చేయలేక పోయాయని తెలిపారు. వైఎస్.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏనాడూ కరువు రాలేదన్నారు. రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా ముఖ్యమంత్రి సాయం అందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం రైతులకు ఇస్తున్న రైతు భరోసా నిధులు పంట పెట్టుబడికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏటా కరువు కమ్మేసిందన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న పల్లె రఘునాథ్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులు నింపడానికి ప్రత్యేక జీవో జగన్ ఇచ్చారన్నారు. బెంగళూరు నుంచి విజయవాడకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు నాలుగు లైన్ల రహదారుల పనులు జరుగుతున్నాయన్నారు. పుట్టపర్తి కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడడంతో ఇక్కడ స్థానికులకు ఉపాధి లభిస్తోందన్నారు. నియోజకవర్గంలో 31 రహదారుల మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి రూ.35 కోట్లను రహదారుల మరమ్మతులకు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

కరువుపై కనిపించని స్పందన

◆ మిగిలిపోయిన కరువు మండలాలు ఇక అంతేనా ?
◆ నిరాశపరచిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన



పుట్టపర్తిలో బహిరంగ సభకు హాజరైన రైతులు, ప్రజలు, బహిరంగ సభలోప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తారని ఉమ్మడి అనంతపరం జిల్లా వాసులు ఆశించారు. ఆయన ప్రసంగంలో ఎక్కడా అటువంటి స్పందనేది కనిపించలేదు. నాలుగేళ్లు కరువు లేదు.. ఈసారి కొన్ని మండలాల్లోనే ఉందంటూ దాటవేశారు. పుట్టపర్తి జిల్లాలో 11 మండలాలు కరువు మండలాల జాబితాలో లేవని,డ వీటిని కరువు మండలాలుగా ప్రకటించాలని ఒకవైపు ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ దీనిపై ఎటువంటి ప్రకటనా ముఖ్యమంత్రి నుంచి రాలేదు. రైతు భరోసా రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి మంగళవారం విచ్చేశారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చారు. అక్కడ అనంతపురం, సత్యసాయి జిల్లా నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బటన్ నొక్కి రైతు భరోసా పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తమ హయాంలో రైతుల కోసం చేసిన కార్యక్రమాలను వివరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో రూ.1.75 లక్షల కోట్లు రైతులకు ఖర్చు పెట్టామని వివరించారు. అదే తెలుగుదేశం హయాంలో రైతులను పట్టించుకోలేదని విమర్శలు చేశారు. ఆద్యంతం ఆయన ప్రసంగం మొత్తం రెండు ప్రభుత్వాల పాలనను బేరీజు వేస్తూ వివరించే ప్రయత్నం చేశారు. అయితే ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితుల గురించిగానీ, ఇక్కడి అభివృద్ధి అంశాలను గురించి ప్రస్తావించలేదు. సాగు,తాగునీటి కష్టాలు కూడా త్వరలో రాబోతున్న తరుణంలో ఈ అంశాలపై ముఖ్యమంత్రి ఏమైనా హామీలిస్తారని రెండు జిల్లాల వాసులు ఎదురు చూశారు. కాని అటువంటి ప్రకటనేది చేయలేదు. పుట్టపర్తి నియోజకవర్గం పరిధిలో 31 రహదారుల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేస్తామన్న హామీ ఒక్కటే ఆయన ఇచ్చారు. ఎన్నికల సమయంలో జిల్లాకు ఏమైనా వరాలిస్తారని భావించినప్పటికీ అటువంటి అంశాలేవి ప్రసంగంలో ప్రస్తావనకు రాలేదు. ఇది అనంతపురం, సత్యసాయి జిల్లావాసులు నిరాశ పరిచింది. అదే విధంగా సత్యసాయి జిల్లాను తిరిగి అనంతపురంలో వీలినం చేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఈ అంశంపైనా ఆయన ఎటువంటి స్పష్టతనూ ఇవ్వలేదు.

ప్రొటోకాల్‌పై వివాదం

ముఖ్యమంత్రి సభా వేదికపై ప్రొటోకాల్ అంశాలపై చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వేదికపైకి ఎక్కేసరికి ఆయనకు కేటాయించిన సీటు ఏదీ లేకపోవడంతో అక్కడున్న జిల్లా వ్యవసాయాధికారిని ప్రొటోకాల్ పాటించరా.? అని అడగడంతో ఆయన పరుగునవెళ్లి కూర్చీ తీసుకొచ్చి ఆయనే వేశారు. అనంతపురం ఎంపీ విషయంలోనూ అదే రకంగా జరిగింది.

ముఖ్యమంత్రికి జర్నలిస్టుల సన్మానం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి జర్నలిస్టులు జ్ఞాపికను అందజేయడంతో పాటు శాలువా కప్పి సన్మానించారు. జర్నలిస్టులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలివ్వాలని క్యాబినెట్‌లో ఇటీవల నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తికి మంగళవారం నాడు ఆయన విచ్చేసిన సందర్భంగా జర్నలిస్టులు కలసి ఆయన్ను సన్మానించారు. ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రామచంద్రారెడ్డి, శివారెడ్డి, పి.శ్రీనివాసులు, నరేష్, అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు, నాయకుల కోసం సుదీర్ఘ సమయం కేటాయింపు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ పర్యటనలో జిల్లా నేతలకు సుదీర్ఘ సమయమే కేటాయించారు. సాధారణంగా జగన్మోహన్‌రెడ్డి ముఖ్య నేతలతో కలసి వెళ్లిపోవడం జరుగుతూ ఉంటుంది. త్వరలో ఎన్నికలు సమీస్తున్న తరుణంలో ఈసారి సమయం ముగిసినా ముఖ్య నాయకులతోపాటు, ద్వితీయ శ్రేణి నాయకుల వరకు అందరికీ సమయమిచ్చి మాట్లాడారు. దీంతో ఆయన తిరుగు ప్రయాణం నిర్ణీత సమయం కంటే ఆలస్యంగానే సాగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పుట్టపర్తి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శంకర్‌నారాయణ, సిద్ధారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తిప్పేస్వామి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాది రైతు ప్రభుత్వం : వైఎస్.జగన్మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రికి నాగలి అందిస్తున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు

పుట్టపర్తి అర్బన్ : రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన రైతు ప్రభుత్వం తమదని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా సాయం పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన బహిరంగ సభలో రైతులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు అండగా నిలుస్తోందని చెప్పారు. రైతన్నకు మంచి జరగాలి.. పేద వాడికి మేలు జరగాలి.. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విత్తనం నుంచి పంట అమ్మకం వరకు ప్రతి రైతన్నను చెయ్యి పట్టుకుని నడిపించేందుకు ప్రభుత్వం ద్వారా అన్ని రకాలా సాయం అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. చంద్రబాబు నాడు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి రైతులకు ఎలాంటి సాయం అందించలేదన్నారు. టిడిపి స్కీమ్‌ల ప్రభుత్వం కాదని.. స్కాంల ప్రభుత్వం అన్నారు. చంద్రబాబు పేరు చెబతే స్కామ్‌లే గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబుకు అధికారం ఎందుకు కావాలన్నది ప్రజలు ఆలోచన చేయాలని తెలిపారు.

ప్రజాసమస్యలు పట్టని ప్రభుత్వాలు

◆ జైలు, బెయిలు రాజకీయాలతోనే సరి ◆ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓబులు



గుంతకల్లులో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న జి.ఓబులు

ప్రజాశక్తి-గుంతకల్లు, గుత్తి, ఉరవకొండ

రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి జైలు, బెయిలు రాజకీయాలతో కాలం గడిపేస్తున్నారని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు విమర్శించారు. వెనుకబడిన అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి స్కూటర్‌యాత్ర మంగళవారం 2వ రోజు పలు మండలాల్లో కొనసాగింది. గుత్తిలో ప్రారంభం అయిన యాత్ర గుంతకల్లు మీదుగా వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు, కణేకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, శెట్టూరు మీదుగా రాత్రికి కుందుర్పి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సభల్లో నాయకులు ప్రసంగించారు. గుతంతకల్లు పొట్టి శ్రీరాములు కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఓబులు మాట్లాడుతూ వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధికి పాలకులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. జిల్లాకు ఉన్న ఏకైక సాగునీటి వనరు తుంగభద్ర హెచ్ఎల్ఎసి కాలువ కింద నిర్ణయించిన ఆయకట్టు భూములకు ఇప్పటి వరకూ ఏనాడు పూర్తిస్థాయిలో నీరు అందించిందిలేదన్నారు. పది మందికి ఉపాధి చూపే ఒక్క పరిశ్రమ కూడా వైసిపి ప్రభుత్వం జిల్లాలో నెలకొల్పలేదని అన్నారు. గుంతకల్లు పట్టణంలో మూతపడిన స్పిన్నిగ్ మిల్లులో ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేయడంలోనూ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుకు అన్ని అర్హతలున్న గుంతకల్లు రైల్వే డివిజన్‌ను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికల సంఖ్యను పెంచి ప్రజా ఆరోగ్యాలు కాపాడాలన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి నాగసముద్రం వరకు పిల్ల కాలువలను ఏర్పాటు చేసి సాగు నీరు అందించి రైతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. **గుత్తి**లో జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాకు గత 15 సంవత్సరాలుగా హంద్రీనీవా నీరు వస్తున్నా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదన్నారు. వెయ్యి మందికి ఉపాధి చూపే ఒక్క పరిశ్రమ కూడా జిల్లాలో లేదన్నారు. గ్రామాల్లో వరుస కరువులతో వ్యవసాయ కూలీలు వలసల్లోనే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. **వజ్రకరూరు, ఉరవకొండ** మండలాల్లో జరిగిన కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా లక్ష ఎకరాలకు సాగు నీరు ఇస్తామని హామీని ఇచ్చిన వైసిపి నాయకులు దానిని నిలబెట్టుకోలేక పోయారని విమర్శించారు. కరువుతో సతమతం అవుతున్న ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాయకులు వి.నిర్మల, డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, రంగారెడ్డి, దాసరి శ్రీనివాసులు, మారుతి ప్రసాద్,కసాపురం రమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, గుత్తి సిపిఎం మండల కార్యదర్శి రామక్రిష్ణ, ఉరవకొండ, వజ్రకరూర్ మండలాల కార్యదర్శులు మధుసూదన్, విరుపాక్షితో పాటు అన్ని మండలాల సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేద్దాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్



చలో విజయవాడ పోస్టర్లు అతికిస్తున్న రాంభూపాల్ తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి జరగాలని, అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు అనంతపురం నీలిమా సర్కిల్ చలో విజయవాడ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి పదేళ్లు పూర్తైనా అభివృద్ధి మాత్రం అడుగు ముందుకు పడలేదన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు పరిశ్రమ, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు, రైల్వే జోన్ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయని బిజెపిని నిలదీయాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వం దాసోహం అయ్యిందన్నారు. కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. దేశీయ వ్యవసాయానికి, ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చిందన్నారు. విద్యా, వైద్యాన్ని పూర్తిగా ప్రయివేటీకరిస్తోందన్నారు. వీటన్నింటినీ పార్లమెంట్‌లో వైఎస్ఆర్‌సిపి, టిడిపిలు ప్రత్యక్షంగా, పరోక్షంగా బలపరుస్తున్నాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయని తెలిపారు. లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పెన్షన్ విషయంలో ఇచ్చిన హామిని తుంగలో తొక్కి జిపిఎస్ పేరుతో మోసం చేసిందన్నారు. అంగన్‌వాడీలు, ఆశాలు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలన్నీ గాలికెగిరిపోయాయని విమర్శించారు. నిరసనలు తెలిపే స్వేచ్ఛను కూడా వైసిపి ప్రభుత్వం హరిస్తోందన్నారు. అనంతపురం జిల్లా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో దశాబ్దాలుగా వెనుకబడిందన్నారు. సాగునీరు కల్పించడంలోనూ, కరువు సహాయక చర్యలు ప్రకటించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ స్థాపించలేదన్నారు. ప్రభుత్వ విద్య, వైద్యం బలహీనపరిచి కార్పొరేట్ విద్య, వైద్యాన్ని పెద్ద ఎత్తున పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలపై 15న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కమిటి సభ్యులు ఎస్.ముస్కిన్, వై.వెంకటనారాయణ, నాయకులు వలి, ప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్

రైతుభరోసా సాయం రూ.120.17 కోట్లు

అనంతలో 2,94,234 మందికి లబ్ధి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వరుసగా ఐదవ ఏడాది రెండవ విడతగా వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన 2,94,234 మంది రైతులకు రూ.120.17 కోట్ల లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో జిల్లా స్థాయి రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.గౌతమి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, ఎల్డీఎం సత్యరాజ్, రేకులకుంట ఎఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సహదేవ రెడ్డి, హార్టికల్చర్ డిడి రఘునాథరెడ్డి పాల్గొన్నారు. అనంతరం రైతుభరోసా కేంద్రం మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిరికల్చర్ ఆఫీసర్ ఆంజనేయులు, ఫిషరీస్ డిడి శాంతి, మార్కెటింగ్ ఏడీ చౌదరి, కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లేశ్వరి, మార్కెఫెడ్ డిఎం పెన్నేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గార్లదిన్నె



మృతిచెందిన రవినాయక్, సాయిల్ హర్షిత్

మండల పరిధిలోని కల్లూరు గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. గార్లదిన్నె పోలీసులు తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్ వైపు వెళుతున్న ఐచర్ వాహనాన్ని వెనుకనుంచి వచ్చిన వోల్వో బస్సు ఢీకొంది. దీంతో హైదరాబాద్‌కు చెందిన రవికాంత్‌నాయక్ (33), పంజాబ్‌కు చెందిన సాయిల్ హర్షిత్ (20) అక్కడికక్కడే మృతిచెందారు. వీరిద్దరూ మడకశిరలోని ఓ కన్స్ట్రక్షన్ వర్క్ చేసేవారు. ఇందులో భాగంగానే ఐచర్ వాహనంలో కన్స్ట్రక్షన్‌కు సంబంధించిన మెటీరియల్‌ను తీసుకొచేందుకు ఐచర్‌లో వాహనంలో వెళు న్నారు. అయితే తెల్లవారుజామున కావడంతో గాఢ నిద్రలో ఉన్నారు. ఈనేపథ్యంలో కల్లూరు దగ్గర స్పీడు బ్రేకర్ల వద్దకు రావడంతో ఐచర్ వాహనం నిదానమైంది. దీంతో వెనుకవైపు నుంచి వచ్చిన ఓ వోల్వో బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సహకార' సేవలు మరింత విస్తృతం

ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత



మాట్లాడుతున్న లిఖిత

ప్రజాశక్తి-అనంతపురం

కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకు ద్వారా అన్నదాతలు, ప్రజలకు సేవలు అందిస్తున్నామని ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ సహకార సేవలను మరింత విస్తృతపరిచేందుకు సిఎం జగన్ ఇటీవల సహకార సమైక్య పొదుపు పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో నిరుపేద, సామాన్యులకు చిన్న పొదుపు ఖాతాను తెరిచే కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. అక్టోబర్ 30న ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సహకార బ్యాంకులు, ఆప్కాబ్ సంయుక్తంగా పొదుపు ఖాతా సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. సహకార బ్యాంకులో జీరో బ్యాలెన్స్ ఖాతాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సహకార సమైక్య ఖాతాదారులకు పిఎంఎస్‌బివై ద్వారా రూ.15 కడితే బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఎలాంటి ఛార్జీలు లేకుండా రూపే డెబిట్ కార్డులను అందిస్తున్నట్లు చెప్పారు. ఎడిసిసి సహకార బ్యాంకులు కార్పొరేట్ స్థాయి బ్యాంకులతో పోటీపడుతూ సేవలు అందిస్తున్నామనానరు. నవంబర్ 14న కో-ఆపరేటివ్ వారోత్సవాల్లో భాగంగా ఫిక్సడ్ డిపాజిట్లు, గోల్డ్ లోన్లపై ఆకర్షణీయమైన తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే జగనన్న పాలవెల్లువలో భాగంగా పుట్టపర్తి జిల్లాలో పాడి రైతులకు ఒక ఆవుకు రూ.30వేలు, బర్రెకు 40 వేల చొప్పున 867 మందికి అందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ రూ.1,833 కోట్ల లావాదేవీలు జరిగినట్లు వివరించారు. డిసెంబర్ నాటికి రూ.2వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సహకార బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగేపల్లిలో తాగునీటి కటకట

ఎంపిడిఒ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా

ప్రజాశక్తి-కుందుర్పి



మండల పరిషత్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న నాగేపల్లివాసులు

మండల పరిధిలోని నాగేపల్లి నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేపల్లి-శ్రీమజ్జనపల్లి గ్రామాల మధ్య ఉన్న తాగునీటి బోరు పని చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. దీంతో చేసేది లేక దాదాపు 15 రోజుల నుంచి కర్ణాటక రాష్ట్రం పరుశురాపురం వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై స్థానిక సర్పంచి, పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. చేసేది లేక ధర్నాకు దిగామన్నారు. సమస్య పరిష్కరించేంత వరకూ ధర్నా విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. వీలైనంత తర్వగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ విషయంపై ఎంపిడిఒ లక్ష్మీనరసింహాను వివరణ కోరగా త్వరలో గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యను పరిష్కరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది నాగేపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచనలు అవసరం

జెవివి నాయకులు డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెవివి నాయకులు డాక్టర్ కొండయ్య

విద్యార్థులు ఇప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని, అప్పుడే మూఢవిశ్వాసాలు లేని సమాజాన్ని నిర్మించుకోవచ్చని జెవివి నాయకులు, జనరల్ సర్జన్ డాక్టర్ కొండయ్య సూచించారు. మంగళవారం జెవివి ఆధ్యర్యంలో నగరంలోని నవోదయ కాలనీ గిరిజన గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ అర్జున్ నాయక్ అధ్యక్షతన సైంటిటిఫిక్ టెంపర్ డే క్యాంపెన్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సి.వి.రామన్ జయంతి అన్నారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో మొట్టమొదటి నోబెల్ బహుమతి, భారతరత్న అందుకొన్న వ్యక్తి అన్నారు. మానవుని యొక్క ప్రగతి శాస్త్ర విజ్ఞానం అభివృద్ధిలో కనపడుతుందిని, కావున పాలకులు శాస్త్రీయ విజ్ఞాన అభివద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ నేటి సమాజంలో పాలకులు నిజమైన శాస్త్ర సాంకేతిక అభివద్ధికి కాకుండా యాంటీ సైన్స్, సూడో సైన్స్‌కు ప్రాధాన్యత నిస్తున్నాయని తెలిపారు. మేడం క్యూరి జన్మించిన రోజు కూడా ఈరోజేనని ఎన్నో అడ్డంకులు దాటుకొని ఫిజిక్స్, కెమిస్ట్రీ రెండిటిలో నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళ ఆమెనే అన్నారు. యాంటీ సైన్స్, సూడో సైన్స్ వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 7వతేదీ నుంచి నుంచి దేశవ్యాప్తంగా అల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సైన్స్ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో జెవివి నగర అధ్యక్ష కార్యదర్శులు విజయలక్ష్మి, గాంగే నాయక్, నాయకులు రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మినారాయణ, ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, నవీన్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు విద్యార్థి ఎంపిక

రాయదుర్గం రూరల్ : స్థానిక కెజిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ తృతీయ సంవత్సరం చదువుతున్న రాజేష్ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రఘురామమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరువనంతపురం, యూనివర్సిటీ ఆఫ్ కేరళ, పాలెంలో నవంబర్ 13 నుంచి 18వ తేదీ వరకు జరిగే బాస్కెట్‌బాల్ పోటీలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తరపున విద్యార్థి పాల్గొననున్నట్లు తెలిపారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'పై అవగాహన

రాయదుర్గం : ఈనెల 9న నిర్వహించనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమంపై మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ళశిల్ప మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం చేసిన మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి సచివాలయంలో ఏ రకంగా సంక్షేమ పథకాల లబ్ధి పొందారో వివరాలను బోర్డు రూపంలో నిర్మించాలన్నారు. వార్డు వాలంటీర్లతోపాటు ప్రతి ఇంటికీ వెళ్లి ఏమేరకు లబ్ధి జరిగిందన్న వివరాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాసయాదవ్, వలిబాషా, వార్డు కౌన్సిలర్ ఫక్రుద్దీన్, మేనేజర్ ప్రసాద్, వార్డు ఇన్‌ఛార్జి పొరాళ్ళ శివ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టండి

రాయదుర్గం : జగనన్న హౌసింగ్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని పురపాలక సంఘ అధ్యక్షులు పొరాళ్ళ శిల్ప సూచించారు. మంగళవారం పట్టణంలోని పార్వతీనగర్ 1వ సచివాలయంలో జగనన్న హౌసింగ్ లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులందరూ వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఎప్పటికప్పుడు గృహ నిర్మాణ సంస్థ అధికారులతో మాట్లాడి బిలులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ జయచంద్ర, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి పొరాళ్ళ శివ, భీమనపల్లి దివాకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కుళ్లాయిస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

పుట్లూరు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఆరకటివేముల సచివాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అధికారులు హాజరుకావాలని కోరారు.

తూతూమంత్రంగా హౌసింగ్ సమావేశం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సచివాలయం-1లో మంగళవారం నిర్వహించిన హౌసింగ్ సమావేశం తూతూమంత్రంగా సాగింది. సమావేశానికి కేవలం ఇద్దరు అధికారులు, వాలంటీర్లు మాత్రమే అధికారులు హాజరుకావడంతో విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమావేశానికి హౌసింగ్ అధికారులు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ఉరవకొండ : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సేపక్‌తక్రా క్రీడాసంఘం జిల్లా అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున పిలుపునిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శుల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పోలీస్ గ్రౌండ్ క్రీడా మైదానంలో బాల బాలికలకు సెపక్‌తక్రా జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెపక్‌తక్రా సంఘం ఛైర్మన్ సప్తగిరి మల్లికార్జున, ప్రెసిడెంట్ ఎం.ఎన్.షాహిన్, రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్.కె.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న, సెంట్రల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల



సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

రైతులకు ఇచ్చిన బ్యాంకు రుణాలను వెంటనే మాఫీ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు సహాయ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మరోవైపు హెచ్‌ఎల్‌సి, హంద్రీనీవాకు నీరు వదలకపోవడంతో చేతికి వచ్చే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుంకన్న, జయరాముడు, రామాంజనేయులు, ఓబులేసు, లక్ష్మీనారాయణ, కేసన్న, మునెప్ప, రామాంజనేయులు, ఆంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు వివరాలు తెలపండి : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు



మట్టి తరలింపును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మండలంలో ఎక్కడెక్కడ అనుమతి తీసుకుని మట్టిని తరలిస్తున్నారో ప్రజలకు తెలియజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన స్కూటర్ యాత్ర సందర్భంగా సోమవారం మండల కేంద్రం సమీపంలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన మట్టి తవ్వకాలను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో మట్టిని తరలించేందుకు ప్రయివేట్ సంస్థలకు అప్పగించారన్నారు. అయితే ఏ సర్వే నెంబర్‌లో.. ఎన్ని ఎకరాలకు అనుమతి ఇచ్చారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత కొన్ని నెలల నుంచి పెద్ద పెద్ద జెసిబిలను వినియోగించి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారన్నారు. ఇలా తరలించడం ద్వారా రోడ్లన్నీ గుంతలమయం అవుతున్నాయన్నారు. దీనికితోడు దుమ్ముధూళితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. రోడ్లు పెద్ద పెద్ద గోతులను తలపిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. అనుమతులు ఒకచోటు.. మట్టి తరలింపు మరోచోట జరుగుతున్నట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏ సర్వే నెంబర్లలో.. ఎన్ని ఎకరాల్లో.. ఏఏ వాహనాలకు అనుమతి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, మండల కార్యదర్శి సూరి, సహాయ కార్యదర్శి వెంకట్‌చౌదరి, మండల నాయకులు పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ


ఇంటి పట్టాను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ లలిత అధ్యక్షతన సర్వే నంబర్ 589-5లో 252 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏఒక్క పేదకుటుంబం సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. జగన్ సిఎం అయ్యాక నాలుగేళ్లలో ఉరవకొండలోనే రూ.200 కోట్ల డిబిటి, నాన్ డిబిటి కింద అనేక పథకాల ద్వారా పేదలకు అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, నాయకులు వన్నప్ప, వీరన్న, బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, సుంకన్న, ఓబన్న, సుశీలమ్మ, గోవిందు, వెంకటేష్, వడ్ల షేక్షావలి, పామిడి సలీమ్, ఈడిగ ప్రసాద్, హొన్నూరుసాబ్, శర్మస్, రేణుకమ్మ, ఓబుళమ్మ, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ అమృత్‌రాజ్, హౌసింగ్ డీఈ హనుమప్ప, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలిస్తాం..

అర్హులైన ప్రతి జర్నలిస్టుకీ స్థలాలతోపాటు ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేస్తామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇళ్లస్థలాలు విషయంలో స్పందించాలని జర్నలిస్టులను కోరగా స్పందించిన ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆర్‌డిఒ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీధరమూర్తితో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు కేటాయించిన స్థలం కోర్టు వివాదం, సమస్య పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ మూడు సెంట్ల స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మాజీఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

అధికారులే సమావేశానికి రాకుంటే ఎలా..?

ప్రజాశక్తి-నార్పల


మాట్లాడుతున్న ఎంపిడిఒ దివాకర్

సమస్యలు తెలుసుకుని పరిష్కరించాల్సిన అధికారులే సమావేశాలకు రాకుంటే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని పలువురు సభ్యులు ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా అధికారులు వచ్చేందుకు వీలు కాకుంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఎంపిడిఒను నిలదీశారు. ఇందుకు ఎంపిడిఒ దివాకర్ స్పందిస్తూ సమావేశానికి గైర్హాజరైన ప్రతి అధికారికీ నోటీసులు పంపి సంజాయిషీ తీసుకోనున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వ్యవసాయ అధికారి చెన్న వీరాస్వామి మాట్లాడుతూ మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నార్పలను కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వానికి నివేదిక పంపగా కరువు మండలంగా ప్రకటించిందని వివరించారు. అలాగే పక్కాగా ఈక్రాప్ బుకింగ్ చేసినట్లు తెలిపారు. వీరితోపాటు పలువురు సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి శైలజారాణి, సీనియర్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, కాటమయ్య, పద్మాకర్‌రెడ్డి, పుష్పలత, శారద, ఎంఇఒ నారపరెడ్డి, వెలుగు ఎపిఎం తిప్పమ్మ, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కంప చెట్లు తొలగింపు

ఉరవకొండ : విడపనకల్లు మండలం గడేకల్ నుంచి ఎన్.తిమ్మాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో అడ్డంగా పెరిగిన కంపచెట్లు, ముళ్ళపొదులను ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, సర్పంచి సుశీల ఉమాశంకర్ మంగళవారం తొలగించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉమాశంకర్, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, తిప్పేరుద్ర, జగన్మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వినాశకర విధానాలతో ప్రజల నయవంచనకు పాల్పడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 15న విజయవాడలో తలపెట్టిన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ముస్కీన్, వెంకటనారాయణ, నగర కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, బాలకష్ణ, శివ, భాస్కర్, నాగరాజు, పెన్న ఓబులేసు, శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన

ప్రజాశక్తి-గుత్తి


వినతిపత్రం స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

ఏపీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రాజశేఖర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ కు స్పందన లభించింది. ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (ప్రత్యేక విద్యుత్ అదాలత్) కు ఛైర్ పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు కె. రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్‌ఎల్.అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ హాజరై బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలు చెందిన పలువురు వినియోగదారులు వేదికలో తమ సమస్యలను విన్నవించుకున్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ గుత్తి, గుంతకల్లు డిఇలు సాయి శంకర్, రఘు, ఏవో నరసప్ప, యుగంధర్ నాయుడు, అసిస్టెంట్ ఇంజనీర్లు ఎం.శ్రీకుమార్, కె.మధుసూదన్‌రావు, షఫీ, చంద్రశేఖర్, లైన్ ఇన్స్‌పెక్టర్లు కె.నాగేంద్ర ప్రసాద్, ప్రహ్లాద సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-నార్పల

దీపావళి పండగ సందర్భంగా లైసెన్స్‌లు పొందిన దుకాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మండల వ్యాప్తంగా కేవలం లైసెన్సు పొందిన దుకాణాల్లో మాత్రమే బాణాసంచాను విక్రయించాలన్నారు. అలాగే విక్రయించే ప్రాంతాల్లో నీరు, ఇసుక, అగ్నిమాపక సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులను ప్రదర్శించాలన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు. కాగా ఇళ్లల్లో కూడా పెద్దల పర్యవేక్షణలోనే టపాసులను కాల్చాలని సూచించారు.

పెద్దవడుగూరు : లైసెన్స్ కలిగిన టపాసుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎస్‌ఐ డి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అనుమతి తీసుకున్న ప్రాంతాల్లోనే బాణాసంచాను విక్రయించాలన్నారు. అలాగే దుకాణాల వద్ద అగ్నిప్రమాద నివారణ సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే టపాసులు కాల్చే వారు కూడా తారాజువ్వల్లాంటి టపాసులను గడ్డివాములు, గుడిసెలు, పెట్రోలు బంకుల వద్ద కాల్చరాదు. విద్యుత్ తీగలు, చెట్లు కింద కాలిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుని దీపావళి పండుగను జరుపుకోవాలని కోరారు.

క్యాన్సర్ దినోత్సవ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతలక్ష్మి ఇంజనీరింగ్ జాతీయ సేవా పథకం, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్తంగా మంగళవారం జాతీయ క్యాన్సర్ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ఇటుకులపల్లి గ్రామం వరకూ సాగింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు మాట్లాడుతూ అత్యంత భయంకరమైన వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి అన్నారు. దేశంలో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతూనే వస్తోందన్నారు. ఈ వ్యాధితో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. కావున క్యాన్సర్‌లో ముందస్తు రోగ నిర్ధారణ, తక్షణ వైద్య సంరక్షణ చాలా ముఖ్యమైనవన్నారు. ప్రారంభ దశలో రోగనిర్ధారణ చేసినప్పుడు చికిత్స సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామమూర్తి, కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సురేంద్రనాయుడు, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఛైర్మన్ మాధవి, నీరజ, జాతీయ సేవా పథకం అధికారి ఖాళీల్ బాషా, నవీన్, అధ్యాపకులు ప్రత్యూష, బాలచంద్ర, అరుణకుమారి పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వినతి

నార్పల : మండల కేంద్రంలో నివాసం ఉండే ప్రయివేట్ వాహన డ్రైవర్లకు స్థలాలు ఇవ్వాలని కోరుతూ తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో కూడా విన్నవించామన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ హరికుమార్ స్పందిస్తూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల డ్రైవర్లు చాందు, ప్రసాద్, లక్ష్మీపతి, శ్రీనివాసులు, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాల ప్రిన్సిపల్ సస్పెన్షన్

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంజిత్‌నాయక్‌ను ఎట్టకేలకూ సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులను వేధిస్తున్నారని కొన్నాళ్లుగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కుమార్తె, గుంతకల్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు వెంకట్‌నాయక్‌లు కళాశాలను సందర్శించి పరిస్థితులను ఆరాతీశారు. అధ్యాపకులు, విద్యార్థులను ఇబ్బందులను తెలుసుకుని ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేయడంతో ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ రాష్ట్ర కార్యదర్శి కళాశాల ప్రిన్సిపాల్ స్పందిస్తూ సంజిత్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తాగునీటి శుద్ధిపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంలో భాగంగా నీరు ఎలా శుద్ధి చేస్తారో అనే విధానంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ వి.మల్లికార్జున సూచించారు. మంగళవారం మున్సిపాలిటీలో పరిధిలో జల్ దివాలి (నీటి దీపావళి నీళ్ల కోసం మహిళలు, మహిళల కోసం నీళ్లు) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ పరిశుభ్రత సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు వివిధ ప్రక్రియలు ఎలా నిర్వహిస్తారనే అంశంపై ఆలూరు రోడ్డులోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఇ గురప్పయాదవ్, డిఇలు రామ్మూర్తి, సుమ, ఎఇ హరికృష్ణ, మెప్మా టిపిఆర్ఓ మోహన్, సిఎంఎం భవానీ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు, టిఎల్ఎఫ్ బిఒలు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

టిడిపి అధినేత చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శనివారం మండల పరిధిలోని దండువారిపల్లి గ్రామంలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలనలో సిఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. నాలుగున్నరేళ్లలో వైసిపి కూల్చడం తప్ప చేసింది శూన్యమన్నారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో వైసిపిని ఇంటికి సాగనంపి టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దండువారపల్లి ఆదినారాయ, పిరవీంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, తదితరులు పాల్గొన్నారు.


టిడిపి మేనిఫెస్టో పత్రాలను చూపుతున్న టిడిపి నాయకులు, ప్రజలు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య


మృతిచెందిన మనోహర్

శింగనమల : మండల పరిధిలోని పోతురాజుకాలువ గ్రామ సమీపంలో ఉన్న కూతలేరు బ్రిడ్జి కింద పెరవలి గ్రామానికి చెందిన ఆసాది గొడుగుల మనోహర్ (39) సోమవారం రాత్రి ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఏఎస్‌ఐ చితంబరయ్య తెలిపిన వివరాల మేరకు.. పెరవలి గ్రామానికి చెందిన మనోహర్ అనంతపురంలో నివాసం ఉంటున్నాడు. ఈనేపథ్యంలో అప్పుల బాధ తాళలేక గ్రామ శివారులో ఉన్న కూతలేరు బ్రిడ్జి వద్దకు చేరుకుని తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం పోతురాజుకాలువ వాసులు సమీపంలో ఉన్న పొలాలకు వెళ్తుంగా గమణించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించగా మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. తర్వాత పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కేబుల్ వైర్ చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు, సంజీవపురం గ్రామాలకు చెందిన 15 మంది రైతులకు సంబంధించిన కేబుల్ వైర్ సోమవారం రాత్రి చోరీకి గురైంది. కడవకల్లు గ్రామానికి చెందిన మునిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామచంద్రారెడ్డి, కొండారెడ్డికి చెందిన కేబల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. గతంలో వీరికి చెందిన కేబుల్ వైర్లే చోరీకి గురికావడం గమనార్హం. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి దొంగలను పట్టుకుని విముక్తి కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని బోయ కాలనీలో నాటుసారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారంతో సిబ్బందితో దాడులు చేయగా మహిళను అరెస్టు చేయడంతోపాటు నాలుగు లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె : మండలంలోని ముకుందాపురం గ్రామంలో ఓ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కురుబ నారాయణపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన బాలికపై నారాయణ చేయి పట్టుకుని లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

జెఎన్‌టియు ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించిన ఎంఎస్‌సి 2వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంఎస్‌సి 3వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

పరీక్షలు వాయిదా

అనంతపురం : నేడు విద్యాసంస్థల బంద్‌ను పురస్కరించుకుని అనంతపురం జెఎన్‌టియు పరిధిలో పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు డిఇ కేశవరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమణించాలని కోరారు.

సామాజిక అడవులతోనే అభివృద్ధి : ఐఎఫ్ఎస్

అనంతపురం : సామాజిక అడవుల నిర్వహణ ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఐఎఫ్ఎస్ నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎస్‌కెయులో సీనియర్ ఆచార్యులు ప్రొఫెసర్ సుధాకర్ పర్యవేక్షణలో సామాజిక అడవుల నిర్వహణ ద్వారా అభివృద్ధి అనే అంశంపై ప్రొఫెసర్ గణేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ముని నారాయణప్ప, సోషల్ సైన్స్ డీన్ వెంకటరమణ, ప్రిన్సిపల్ కృష్ణకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిరోజ్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

బుక్కరాయసముద్రం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు మండలంలోని అమ్మవారిపేట గ్రామంలో ఉన్న రేషన్ దుకాణాల్లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు వి.వెంకటరమణ, పి.శేషగిరి, బీటీ.రాజశేఖర్, బీఎల్.రవీంద్రనాథ్, పి.రామకృష్ణారెడ్డి, టి.ఆదినారాయణమ్మ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి బియ్యం అందజేత

అనంతపురం కలెక్టరేట్ : సహాయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం ఎన్ఆర్.కాలనీకి చెందిన నిరుపేద బొజ్జన్న కుటుంబానికి 5 ప్యాకెట్ల బియ్యాన్ని అధ్యక్షులు గడ్డం ముత్యాలప్ప అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటరిగా జీవిస్తున్న బొజ్జ న్నకు తమ వంతు సహాయంగా 3 నెలలకు సరిపడ బియ్యం అందించినట్లు తెలిపారు. దాతలు ముందుకొచ్చి బొజ్జన్నకు మరింత సహాయం అందించాలని కోరారు.

టీ స్టాల్ ప్రారంభం


టీస్టాల్‌ను ప్రారంభిస్తున్న మేయర్

అనంతపురం : నగరంలోని ఎంజీ షోరూమ్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను మేయర్ మహమ్మద్ వసీం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పూణేకు చెందిన పాటిల్ కట్టా నగరంలో నూతన బ్రాంచిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, బాబా ఫకృద్దీన్, వైసీపీ నాయకులు షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం మంజూరు

ఉరవకొండ : మండలంలోని హంద్రీనీవా కెనాల్‌పై 9వేల ఎకరాలకు నీరిచ్చేందుకు తలపెట్టిన రాకెట్ల-ఆమిద్యాల లిఫ్ట్ కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం లిఫ్ట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రాకెట్ల, ఆమిద్యాల, సొల్లాపురం గ్రామాల రైతులతో రాకెట్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే రైతుల ఖాతాల్లో పరిహారం డబ్బు జమవుతుందన్నారు.

పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేయాలి


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని అన్ని డివిజన్లకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ పక్కన ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపడం లేదని కార్పొరేటర్ లీలావతి మేయర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన మంగళవారం పిఎబిఆర్ మెయిన్ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్ హెచ్ ట్యాంకును నింపకపోవడంతో ట్యాంకు ఏరియాకు తాగునీటి సరఫరాలో ఆటంకం ఏర్పడుతోందన్నారు. పీఏబీఆర్ మెయిన్ పైప్‌లైన్ నుంచి అదనంగా ఇంటర్ కనెక్షన్ ఇవ్వడంతో ట్యాంకును పూర్తిస్థాయిలో నిండుతుందని తాగునీటి విభాగం అధికారులు మేయర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా, ఇషాక్, వైసిపి నాయకులు షేక్షావలి, ఆదినారాయణ, డిఇ సుభాష్, ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.